ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 24 సెప్టెంబరు 2025

**** గరిష్ఠం 30.0 కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 586.50 (302.9125) | 3,42,506 | 3,42,506 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.90 (4.17) | 12,184.84 | 12,184.84 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 170.831 (39.5561) | 2,89,300 | 3,14,300 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

# అదే ఉత్కంఠ



- రిజర్వేషన్లపై ఆరా తీస్తున్న నాయకులు
- తొలుత బీసీ రిజర్వేషన్లపై జీవో
- వెనువెంటనే రిజర్వేషన్ల స్థానాల ప్రకటన
- నేడో, రేపో ప్రకటన వస్తుందనే సమాచారం
- ఆ తరువాత ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం
- ఇప్పటికే కసరత్తు పూర్తిచేసిన ఎన్నికల సంఘం

నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 24 తరువాత ఏ క్షణమైనా బీసీ రిజర్వేషన్లకు ప్రత్యేక జీవో విడుదల చేస్తారని, వెనువెంటనే వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ పదవులకు రిజర్వేషన్లను ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ నెల 22 అర్ధరాత్రి ఆర్డీవోలు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు రిజర్వేషన్లను ఖరారు చేయగా, 23న కలెక్టర్లు జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్లను నిర్ణయించి సీల్డ్ కవర్ ఉంచి, పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అధికారులు రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. వెనువెంటనే ఒకటి, రెండు రోజుల తేడాతో పరిషత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని ఉన్నతస్థాయి అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### రిజర్వేషన్లపై నాయకుల ఆరా

ప్రభుత్వం తాజాగా సూచించిన మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్లను ఆర్డీవోలు, కలెక్టర్లు నిర్ణయించారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రిజర్వేషన్ల వివరాలను వెల్లడించకుండా గోప్యత పాటిస్తుండడంతో జిల్లాలో ఏ స్థానాలు, ఏ కేటగిరీకి దక్కాయనే ఆసక్తి నాయకుల్లో కనిపించింది. బీసీలకు గత ఎన్నికల్లో 25శాతం ఉంటే, ఈసారి అది 42 శాతానికి పెరగడం, గత రిజర్వేషన్ల సైకిల్‌ను ఈసారి అమలు చేయకుండా 2008లో అనుసరించిన

మిగతా 8వ పేజీలో...

### యంత్రాంగం సన్నద్ధం

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత కలిపి మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 పంచాయతీల్లో 17,500కుపైగా వార్డు స్థానాలు, 723 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఎంతవరకు అవసరమవుతారనే అంశంలో ఇప్పటికే ప్రాథమికంగా సమాచారం సిద్ధం చేశారు. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో, అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ గుర్తులను ఇప్పటికే సిద్ధం చేశారు. రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలనే అంశంపై ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్న మేరకు రిజర్వేషన్ల కోటా, కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ముందుగా పరిషత్‌లకు, తదుపరి పక్షం రోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల నిర్వహణపై పోలీస్‌శాఖ సైతం ముందస్తు సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సున్నిత ప్రాంతాలు, అతి సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించే పనిని పోలీస్‌శాఖ నిర్వహిస్తోంది. ఈ జాబితా తయారుచేసుకొని అవసరమైన పోలీస్ బలగాలను అందుబాటులో ఉంచేలా ప్రాథమిక కసరత్తు చేస్తోంది.

# పొమ్మన లేక పొగబెట్టారు!

- మెడికల్ కళాశాలల్లో 104 ఉద్యోగుల సర్దుబాటు
- ఇప్పటికే ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు
- తాజాగా దూరప్రాంతాలకు బదిలీచేస్తూ ఉత్తర్వులు



నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 104 అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో సర్దుబాటు చేసింది. ఇప్పటికే ఆరు నెలలుగా వేతనాలు రాక ఉమ్మడి జిల్లాలోని 120మంది అవుట్ సోర్సింగ్ 104 ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 104 వాహనాలు గత ఏడాదిగా పనిచేయకపోవడంతో ఈ విభాగంలో విధులు నిర్వహించే ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆపరేటర్లు, డ్రైవర్లను డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు మలేరియా, ఎన్‌సీటీ విభాగాలల్లో సర్దుబాటు చేశారు. వీరంతా రెగ్యులర్ ఉద్యోగుల్లా బాధ్యతలు నిర్వహిస్తున్నా, ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కాగా, వేతనాల కోసం కొద్ది రోజులుగా వీరు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో తాజాగా, మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కేవలం రూ.17వేల నుంచి రూ.20వేల లోపు వేతనం ఉన్న వీరందరినీ దూర ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కళాశాలలకు బదిలీ చేశారు. దీంతో పొమ్మన లేక పొగపెట్టారని 104 ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 70మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. సూర్యాపేట జిల్లాలో పనిచేసే 104 ఉద్యోగులను ఖమ్మం జిల్లాకు, నల్లగొండలో పనిచేసే 12మందిని యాదాద్రి జిల్లాకు బదిలీచేశారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని కొంతమందిని మహబూబ్‌నగర్‌కు సైతం బదిలీచేసినట్టు తెలిసింది. సుమారు 100కి.మీలకు దూరంగా ఉన్న మెడికల్ కళాశాలలకు

మిగతా 8వ పేజీలో...

# సన్న బియ్యం పథకం ఎలా ఉంది?

### వ్యాపారులను ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎం భట్టితో నార్కట్‌పల్లి వ్యాపారులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత సన్న బియ్యం పథకం అమలు తీరు ఎలా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాపారులను ఆరా తీశారు. ఆయన మంగళవారం 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లిలోని ఓ హోటల్ వద్ద అల్పాహారానికి ఆగారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన నార్కట్‌పల్లికి చెందిన పలువురు రైస్ మిల్లుల యజమానులు డిప్యూటీ సీఎంను చూసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో మీరేం చేస్తారంటూ వారిని అడిగి తెలుసుకున్న డిప్యూటీ సీఎం ఉచిత సన్నబియ్యం పంపిణీతో మీ బియ్యం వ్యాపారాలు ఎలా ఉన్నాయని అడిగారు. సన్నబియ్యం పంపిణీతో బియ్యం వ్యాపారం తగ్గిందని వారు డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన్ను కలిసిన వారిలో దోసపాటి ప్రసాద్, పసునూరి శ్రీనివాస్, అమరవాది రాములు, దోసపాటి రఘు, వడ్డెగోని రామలింగం, ప్రజ్ఞాపురం రాములు, తదితరులు ఉన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి కృషి

### ఎస్పీ శరత్‌చంద్ర పవార్



పోలీస్ సిబ్బందితో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి ఉలెన్ జాకెట్‌లు, రెయిన్ కోట్‌లు, కిట్ బ్యాగులు, జంగిల్ ప్యాచ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది వర్షకాలం, చలికాలం విధి నిర్వహణలో ఇబ్బంది కలగకుండా జాకెట్లు, రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు శ్రీను, సంతోష, ఆర్‌ఎస్‌ఐలు కల్యాణ్‌రాజ్, రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష పార్టీలకు ఒక్క సీటూ రాదు

- కండువా మోసే కార్యకర్తలే పార్టీకి బలం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో ప్రతిపక్ష పార్టీలకు ఒక్క సీటు కూడా దక్కకుండా కాంగ్రెస్ నెంబర్ వన్‌గా నిలుస్తుందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ నల్లగొండ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కండువా మోసే కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. కాంగ్రెస్ పాదయాత్రతో, ప్రజా చైతన్యంతో ఏర్పడిన ప్రభుత్వం, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతీ వర్గానికి అండగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేర్చే బాధ్యత ముఖ్య నేతలపైనే ఉందన్నారు. నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తానని విద్య, వైద్యంలో మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తొమ్మిది నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంజీయూలో న్యాయవిద్య, ఫార్మసీ కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. డిండి, బ్రాహ్మణవెల్లెంల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని, కాల్వల లైనింగ్ పనులు వేగంగా పూర్తిచేస్తామని, చెరువులు నింపి రైతాంగానికి బాసటగా నిలుస్తామన్నారు. రోడ్లు, కాల్వలు, కళాశాలలు, ఆస్పత్రులు, ప్రాజెక్టులు ఏది చూసిన నల్లగొండ మోడల్ అనేలా చేస్తానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 100శాతం కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, తిప్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, సైదులు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కూసుకుంట్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ పార్టీ నాలుగు ముక్కలైంది

బీఆర్‌ఎస్ పార్టీ నాలుగు ముక్కలైందని, అది మునిగిపోయే నావ అని తాను ఏనాడో చెప్పానని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే అవినీతి జరిగిందని మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత చెబుతున్నారని, వారి అవినీతికి అంతే లేదన్నారు. కాళేశ్వరం, ధరణి పేరుతో లక్షల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లాలో ఓ లిల్లీపుట్ ఉన్నాడని, అతడు ఎప్పుడూ గెలిచినా రెండు వేలలోపు మెజార్టీయేనన్నారు. భవిష్యత్తులో ఆయన మరోసారి గెలవబోడన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి ఏనాడూ ఎంజీయూలో అడుగుపెట్టిన దాఖలాలు లేవని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్‌ఎస్ లక్షల కోట్ల అప్పు పెట్టినా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు.

# లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి.సలీం డిమాండ్ చేశారు. మంగళవారం దొడ్డికొమరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 2,500 మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. అందులో 552 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసి నేటికీ ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పేదలపై ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో నిర్మించిన 552 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లాటరీ ద్వారా ఎంపికైన వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల పద్మ, సరోజ, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు



లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నేత సిహెచ్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులపై కన్నేసి కాజేయాలని చూస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న బీమా పథకాన్ని జీవో 12ద్వారా ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు ఇచ్చేందు యత్నిస్తోందన్నారు. రూ.346.36కోట్లు యాక్సిస్ లైఫ్ ఇన్సురెన్స్, ఎర్గో జనరల్ ఇన్సురెన్స్ కంపెనీలకు చెల్లించడం ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతుందని, దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నాలో నాయకులు కేశవులు, రవీందర్, సైదాచారి, సైదులు, పాల్గొన్నారు.

# మహిళా సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లెంకలపల్లి, శివన్నగూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. శివన్నగూడ పంచాయతీ కార్యాలయంలో ఇందిరా క్రాంతి పథకం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరా క్రాంతి పథకం అధికారులు నూతన సంఘాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సెర్ప్ ద్వారా రుణాలు అందించి వారు ఉపాధి పొందేలా చూడాలన్నారు. అదేవిధంగా రుణాలను రికవరీ లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు పథకాలను సద్వినియో గం చేసుకునేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పశువులు, కోళ్లు, గొర్రెల షెడ్లను, నర్సరీలను పరిశీలించారు. ఆయ న వెంట ఏపీవో జయరాజు, ఈసీ వివేక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు లక్ష్మి, తదితరులు ఉన్నారు.


మూసీ ప్రాజెక్టుకు

**పోటెత్తిన వరద**

- తొమ్మిది గేట్ల ఎత్తివేత
- సాగర్ 26 గేట్ల నుంచి నీటి విడుదల

7

యూరియా కోసం

**అవే అగచాట్లు**

- అంతటా తెల్లవారుజాము నుంచే రైతుల బారులు

## మత్తడి దుంకిన నార్కట్‌పల్లి చెరువు



అలుగుపోస్తున్న నార్కట్‌పల్లి పెద్దచెరువు వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పెద్ద చెరువు మంగళవారం అలుగుపోస్తోంది. దాదాపు 15 ఏళ్లుగా నిండలేదు. ఈ క్రమంలో బీ వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా నీటి విడుదలవుతున్న నీటితో నార్కట్‌పల్లి పెద్దచెరువును నింపారు. దీంతో జలకళను సంతరించుకుంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో వచ్చిన వరద నీటితో దాదాపు 15 ఏళ్లుగా నిండని పెద్ద చెరువు మంగళవారం మత్తడి దుంకింది. గ్రామ చెరువు నిండి అలుగుపోయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మంగళవారం పూజలు చేసి స్వాగతం పలికారు. అలుగు నీటిలోకి దిగి గంగమ్మ తల్లికి ప్రణమిల్లారు.

### పొంగుతున్న వాగులు.. నిలిచిన రాకపోకలు

నిడమనూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో భారీ వర్షాలకు చెరువులు అలుగులు పోస్తున్నాయి. నిడమనూరు చిలుకలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బంకాపురం కల్వర్టు మీదుగా వరద ముంచెత్తింది. అదేవిధంగా ఊట్కూరులో వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన డైవర్షన్ రోడ్డు రెండోసారి తెగిపోయింది. బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడిగా సాగుతున్నందున వర్షాలతో తరచుగా డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిడమనూరులోని చిలుకల వాగు పొంగి వరద నీరు ముంచెత్తడంతో బంకాపురం కల్వర్టు దెబ్బతింది. దీంతో బంకాపురం, వెనిగండ్ల తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఊట్కూరులోని డైవర్షన్ రోడ్డు తెగి ఊట్కూరు నుంచి నందికొండవారిగూడెం, గౌండ్లగూడెం, సోమారిగూడెం, ముప్పారం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మట్టితో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ వర్షాలకు దెబ్బతింటుంది.

# బీజం ఇక్కడ.. పెంపకం ఎక్కడో?

**నల్లగొండ జిల్లా సరిహద్దులోని డిండి మండలకేంద్రంలోని జిల్లా మత్స్యశాఖ నిర్వహణలోని మత్స్య బీజోత్పత్తి క్షేత్రం శిథిలావస్థకు చేరింది. డిండి రిజర్వాయర్‌కు అనుసంధానంగా 70 ఏళ్ల క్రితం నిర్మించిన చేపపిల్లల ఉత్పత్తి క్షేత్రాన్ని పట్టించుకునే వారు లేరు. నాణ్యమైన చేపపిల్లలను ఉత్పత్తి చేసి చెరువులు, కుంటలలో విడిచి పెట్టేందుకు ఏర్పాటుచేసిన బీజోత్పత్తి క్షేత్రంలో 30లక్షల చేపపిల్లలను పెంచే సామర్థ్యం ఉన్నా పాలకుల నిరక్ష్యానికి గురైంది. దీంతో క్షేత్రం ఆనవాళ్లు కోల్పోతోంది.**
(ఆంధ్రజ్యోతి-డిండి)

- మత్స్య బీజోత్పత్తి క్షేత్రంపై నిర్లక్ష్యం
- పెంచిన చేపలను సొసైటీలకు ఇవ్వని అధికారులు
- క్షేత్రంలో చేపపిల్లల సంఖ్యపై స్పష్టత కరువు
- సొంతంగా చేపపిల్లలను వదులుకుని వేటాడుకుంటున్న మత్స్యకారులు



చేపపిల్లలను పెంచే నీటితొట్లలో చేరిన మురుగునీరు, ముళ్ల పొదలతో కూడుకుపోయిన నీటితొట్లు

నాగర్‌కర్నూల్-నల్లగొండ జిల్లాల సరిహద్దులోని డిండి ప్రాజెక్టుపై 300మంది మత్స్యకారులు చేపలవేటతో జీవనోపాధి పొందుతున్నారు. దీంతో పాటు మండలంలోని మరో నాలుగు సొసైటీల పరిధిలో సుమారు 200 మంది చెరువులు, కుంటల్లో చేపలు వేటాడి జీవనం సాగిస్తున్నారు. అయితే డిండి మత్స్య బీజోత్పత్తి క్షేత్రంలో ఉత్పత్తిచేసిన చేపపిల్లలను స్థానిక మత్స్య సహకారసంఘాల ఆధీనంలోని చెరువులు, కుంటలలో విడిచి పెట్టాల్సి ఉంది. కానీ కొంతమంది ప్రోద్బలంతో ఇక్కడపెంచిన చేపపిల్లలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. తమపరిధిలోని నీటివనరుల్లో చేపపిల్లలను తామే కొనుగోలు చేసి చెరువులు, కుంటల్లో విడిచిపెట్టి వాటినే వేటాడుతున్నట్లు సొసైటీ సభ్యుడు తెలిపారు.

### మత్స్యశాఖపై అంతా నిర్లక్ష్యమే

డిండి మత్స్య బీజోత్పత్తిక్షేత్రంలో 18నీటితొట్లు(చేపపిల్లలను పెంచేహౌస్‌లు) ఉన్నాయి. ఇందులో ఎనిమిది పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉన్న కొన్ని తొట్లలోనూ కంపచెట్లు, పిచ్చిమొక్కలు మొలవగా ఈ ఏడాది ఆగస్టులో కోయిల్‌సాగర్ నుంచి 15లక్షల లార్వదశ(స్పాన్)లోని 3రోజుల రవ్వరకం చేపపిల్లలను 10తొట్లలో పోసి పెంచుతున్నారు. 40 రోజుల వయస్సు (2 నుంచి 3ఇంచుల సైజు) కాగానే సొసైటీ పరిధిలోని చెరువులు, కుంటల్లో విడిచి పెట్టాల్సి ఉంటుంది. ఈ విషయంలో మత్స్యశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తొట్లకు ప్రహరీ లేకపోవడం, హైదరాబాద్-శ్రీశైలం జాతీయరహదారి (765) పక్కనే ఉండడంతో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు తొట్లలోకి చేరుతున్నాయి. అదేవిధంగా పాములు, కప్పలు, పక్షులు, ఇతర కీటకాలు చేరి చేపపిల్లలను తింటున్నాయి.

### అధికారుల పొంతనలేని సమాధానం

డిండి మత్స్య బీజోత్పత్తి క్షేత్రంలో ఎన్ని చేపపిల్లలను పెంచుతున్నారన్న దానిపై అధికారులు పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారు. డిండి క్షేత్రంలోని ఉద్యోగులను సమాచారం కోరగా 10లక్షల పిల్లలను పెంచుతున్నట్లు తెలిపారు. మరో సీనియర్ ఉద్యోగి 15లక్షలని, జిల్లాకేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో అధికారులు 20లక్షలు చేపపిల్లలను పెంచుతున్నట్లు ఎవరికి వారు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.

### కానరాని మత్స్యశాఖ ఉద్యోగులు

ఇక్కడ పనిచేస్తున్న ఎఫ్‌డీవో మెడికల్ సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. డిండి మత్స్య బీజోత్పత్తి క్షేత్రాన్ని ఎవరు పర్యవేక్షిస్తున్నారన్న దానిపై సమాధానం లేదు. మత్స్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సొసైటీల్లోని కొందరి సభ్యులకు అందుబాటులో ఉండడంలేదని ఆరోపణలు ఉన్నాయి. తమ పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిండి మండల కేంద్రంలోని మత్స్యశాఖలో పనిచేసే అధికారులు స్థానికంగా ఉంటూ మత్స్యకారులకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

### చేపపిల్లలు తరలిస్తే చర్యలు తప్పవు

డిండి బీజోత్పత్తి క్షేత్రంలోని చేపపిల్లలను స్థానిక చెరువులు, కుంటల్లోనే విడిచిపెడతాం. ఒకవేళ ఎవరి ప్రోద్బలంతో తరలించినా చర్యలు తీసుకుంటాం. కొత్తగా బాధ్యతలు స్వీకరించా. పూర్తి వివరాలు తెలుసుకుంటా. సొసైటీ సభ్యులకు అందుబాటులో లేని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

రాజారామ్, నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి

### స్థానిక నీటివనరుల్లో చేపపిల్లలను వదలాలి



డిండిలోని మత్స్య బీజోత్పత్తి క్షేత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. ఇక్కడ పెంచిన చేపపిల్లలను సొసైటీ పరిధిలోని చెరువులు, కుంటలలో వదిలి మత్స్యకారులు వలసపోకుండా ఆదుకోవాలి. ఇక్కడ పెంచిన చేపలను ఇవ్వకుండా వేరే ప్రాంతాలకు తరలిస్తుండటంతో మేమే కొనుగోలు చేసి పెంపకం చేపడుతున్నాం.

- తిరుపతయ్య, మత్స్యకారుడు

## వేధింపులపై విచారణ

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయ మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యల ఆరోపణల నేపథ్యంలో ఆ శాఖ జిల్లా అధికారి శ్యాంసుందర్‌పై మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు విచారణ చేపట్టారు. మహిళా ఉద్యోగులపై వేధింపుల ఆరోపణలు పలు పత్రికలలో ప్రచురితం కావడంతో మంగళవారం ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో పలువురు మహిళా ఉద్యోగులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. జరిగిన విషయంపై పలువురిని విచారించి, విధుల నిర్వహణలో ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. బాధ్యత గల అధికారులు ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో సహ ఉద్యోగులతో ఆప్యాయతతో మెలగాలని, కఠిన వైఖరి మంచిది కాదని హితవు పలికారు. జిల్లా అధికారిగా తన మాట ధోరణి మార్చుకోవాలని 15రోజుల సమయం ఇస్తున్నామని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మంతపురివాసికి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



అవార్డు అందుకుంటున్న బండారి ప్రసాద్

ఆలేరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగం చేస్తూనే తనలాగా నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన యువతను ప్రోత్సహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న మండలంలోని మంతపురి గ్రామంలో పోలీస్ కానిస్టేబుల్ బండారి ప్రసాద్ ముదిరాజ్‌కు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర యువజన, క్రీడల మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఈ అవార్డును పొందారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే సైనిక గ్రూప్ అనే వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచిత బుక్స్, ట్రైనింగ్ ఇస్తూ 175 మందికి ఉద్యోగాలు వచ్చేలా చేసిన ప్రసాద్ కృషి అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు 8వేల మంది యువతకు పైగా సైనిక గ్రూప్ ద్వారా శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఆయన చేసిన సేవలకుగాను ఈ బుక్‌లో స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ అవార్డులను పొందాలన్నారు.

## లారీ డ్రైవర్‌పై దాడి

కట్టంగూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లారీడ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి రూ.1,000నగదుతో పాటు మొబైల్‌ఫోన్ అపహరించుకుపోయారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హర్యానా రాష్ట్రానికి చెందిన అమీర్‌ఖాన్ కర్ణాటక రాష్ట్రం బసవ కల్యాణ్ జిల్లాకు చెందిన అక్రమ్ వద్ద కంటియినర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న సాయంత్రం హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌లో టైల్స్ లోడ్ చేసుకుని విశాఖపట్నం వెళ్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎరసానిగూడం స్టేజీ వద్ద బస్ బే వద్ద ఆపి ముఖం కడుగుకుంటుండగా నలుగురు వ్యక్తులు వచ్చి నోరు మూసీ పక్కకు తీసుకెళ్లారు. ఇనుప రాడ్డుతో కొట్టి చంపుతామని బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.1,000 నగదు మొబైల్ స్మార్ట్ ఫోన్‌ను తీసుకుని, లారీ కేబిన్ లోనూ వెతికారని ఎస్‌ఐ తెలిపారు. ఏమీ దొరకకపోవడంతో డ్రైవర్‌ని వదిలి వెళ్లిపోయారని తెలిపారు. ఘటనపై డ్రైవర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

# దొడ్డు బియ్యానికి డిమాండ్

- పండుగ పూట దొడ్డుబియ్యం గుర్తుకొచ్చే
- సన్నబియ్యం కంటే ఎక్కువకు కొనుగోలు చేస్తున్న ప్రజలు



రేషన్ దుకాణంలో దొడ్డుబియ్యం పంపిణీ(ఫైల్)

భువనగిరి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగలో పిండి వంటలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. అన్నివర్గాల వారూ పండుగ పూట పిండివంటలు చేసుకోవడం ఆనవాయితీ. బియ్యం పిండితో మురుకులు, గారెలు, సకినాలు తదితర పిండివంటలు చేస్తుంటారు. దొడ్డుబియ్యం పిండితోనే పిండి వంటలు చేయడం అందరి అలవాటు. ఇందుకు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వమిచ్చిన బియ్యాన్నే పిండి వంటలకు వినియోగించేవారు. రేషన్‌కార్డు లేనివారు కార్డు ఉన్న బ్లాక్ మార్కెట్‌లో దొరికే దొడ్డు బియ్యాన్ని పిండివంటల కోసం కొనుగోలు చేసేవారు. అలాగే ఆ మాసంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులకు దొడ్డుబియ్యం లభించని పరిస్థితి ఉండేది. అయితే ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కొంతకాలం కిందట ప్రారంభమైంది. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించాక ప్రత్యేకించి పిండివంటలు చేసుకునే వచ్చిన తొలిపండుగ దసరా. కానీ పిండి వంటల కోసం దొడ్డుబియ్యం కొరత నెలకొంది. రైతులకు కూడా దొడ్డు ధాన్యాన్ని పండించడం తగ్గించారు. దీంతో దుకాణాలలో కూడా దొడ్డుబియ్యం లభించని పరిస్థితి. అయితే దొడ్డుబియ్యం పిండితోనే పిండివంటలు రుచికరంగా ఉంటాయని, దొడ్డుబియ్యంలో ఉండే అధిక జిగట శాతంతో పిండివంటలు కరకరలాడుతాయని పలువురి అభిప్రాయం. దీంతో దొడ్డుబియ్యం కోసం పలువురు దుకాణాలలో వెతుకుతున్నారు. సూపర్‌మార్కెట్‌లలో దొడ్డుబియ్యం లభిస్తున్నాయి. కానీ సన్నబియ్యం కంటే దొడ్డుబియ్యం ధరనే అధికంగా ఉంటుంది. నాణ్యత ఆధారంగా సన్నబియ్యం కిలో రూ.45-55 పలుకుతుండగా దొడ్డు బియ్యం కిలో రూ.50-60కు విక్రయిస్తున్నారు. నూకలు కిలో రూ.25-30 వరకు ధర పలుకుతోంది. దీంతో కొద్దిమంది ధర అధికమైనా పిండివంటల రుచి కోసం కాస్త ధర ఎక్కువ అయినప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. కొద్దిమంది రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కొద్దిమంది రేషన్‌బియ్యంతోనే సరిపుచ్చుకుంటుండగా మరికొద్దిమంది నూకలను కొంటున్నారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నందునే దొడ్డుబియ్యం ధర పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. ఏదేమైనా పండుగపూట పలువురు రేషన్ దుకాణాల దొడ్డు బియ్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

## కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య



అక్షయ(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ, ఆర్థిక సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం భూదాన్‌పోచంపల్లికి చెందిన రామసాని అనిల్‌రెడ్డికి హైదరాబాద్‌కు చెందిన అక్షయతో 13 ఏళ్ల కిందట వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు. అనిల్‌రెడ్డి వ్యవసాయదారుడు కాగా అక్షయ ఉపాధి నిమిత్తం ప్రైవేట్ కంపెనీలో పనిచేసేందుకు రోజూ హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటుంది. తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనిల్‌రెడ్డి ఉదయం 7 గంటలకు ఇంటికి వచ్చే సరికి అక్షయ ఉరివేసుకుని కనిపించింది. దీంతో తల్లిదండ్రులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ కలహాలతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని పీసాటి సావిత్రి ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కోదాడలో గంజాయి కలకలం

**ఐదు బస్తాల్లో క్వింటాన్నర గంజాయి గుర్తింపు**



కోదాడలో స్థానికులు గుర్తించిన గంజాయి బస్తాలు

కోదాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో గంజాయి కలకలం సృష్టించింది. బంజరుకాలనీ సమీపంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కన ఉన్న మామిడితోటలో గంజాయి బస్తాలను స్థానికులు గుర్తించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేయగా పట్టణ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఐదు బస్తాల్లో క్వింటాన్నర వరకు గంజాయి ఉన్నట్లు సీఐ తెలిపారు. తెల్లవారుజామున పోలీసుల తనిఖీలు తీవ్రం కావడంతో కర్నాటక, యూపీ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఈ గంజాయిని వదిలివెళ్లినట్లు భావిస్తున్నామన్నారు. సీసీ కెమెరాల సాయంతో నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోలీసుపహారాలో డెక్కన్ సిమెంట్ పరిశ్రమ

- అదుపులో 14 మంది నిందితులు



పోలీసు పహారాలో డెక్కన్ సిమెంట్ కర్మాగారం

పాలకవీడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీసులపై దాడి నేపథ్యంలో సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని భవానీపురం డెక్కన్‌సిమెంట్ పరిశ్రమలో పోలీసుల నిఘా పెంచారు. ఆదివారం సాయంత్రం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ కార్మికుడు వినోద్ గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించే విషయంలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, వలస కార్మికులకు మధ్య స్పష్టత కరువై ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు సోమవారం ఉదయం నిర్వహించిన ఆందోళన ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసుల పైకి రాళ్లు, కర్రలతో దాడులు చేయడంతో పోలీసు సిబ్బంది గాయపడ్డారు. అనంతరం అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరోమారు ఘర్షణలకు ఆస్కారం లేకుండా మంగళవారం డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో 100మంది పోలీసుతో పహరా కొనసాగించారు. సోమవారం దాడులకు పాల్పడిన వ్యక్తులను సీసీ కెమరాలు, సెల్‌ఫోన్‌లో తీసిన వీడియోలు ఆధారంగా 14మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కీలక నిందితుల కోసం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, పాలకవీడు ఎస్‌ఐ కోటేష్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గాలింపు చర్యలలో భాగంగా కార్మికుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు.

## ఉద్రిక్తతకు దారితీసిన కాలనీ పేరు



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

పెన్‌పహాడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెనపహాడ్ మండలం దోసపహాడ్‌లో కాలనీపేరు విషయంలో కాం గ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. పోలీసులు నచ్చజెప్పి పంపించడంతో ఉద్రిక్తత తగ్గింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్ ఆధ్వర్యంలో జంగాలకాలనీకి వెళ్లే ముఖద్వారం వద్ద గుంటకండ్ల జగదీష్‌రెడ్డి(జీజేఆర్) కాలనీ పేరుతో ఆర్చి ఏర్పాటుచేశారు. కాలనీవాసులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మా చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని, అందుకు అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డి తమకు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని కాలనీవాసులు ఆరోపించారు.ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, జీజేఆర్‌కాలనీ పేరు ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తూ ఆర్చి తొలగించేందుకు ప్రయత్నించారు. జంగాలకాలనీ అని రాసుకుంటాని తెలపడంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ గ్రామ నాయకుడు, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ ఆయన అనుచరులు వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. దీంతో జంగాలకాలనీవాసులకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలతో, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఉద్రిక్తతకు దారితీస్తుండటంతో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపికృష్ణ అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు. తహసీల్దార్ ధరావత్ లాల్‌నాయక్ మాట్లాడుతూ దోసపహాడ్ పంచాయతీ పరిధిలోని కాలనీ పేరు జంగాలకాలనీ అని రికార్డుల్లో ఉందన్నారు.

# చైన్స్‌సిస్టమ్ పేరుతో భారీగా పెట్టుబడులు

- ఆరు నెలల్లోనే 10వేల మంది సభ్యులు




పాలకుర్తిలో హెప్సీబా మార్కెటింగ్ సెంటర్ ఇదే

పాలకుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా పాలకుర్తి కేంద్రంగా నడుస్తున్న రియాల్టీ బిజినెస్ ఫెయిర్ హెల్ప్ సిస్టం(ఆర్బీఎఫ్) యజమాని తెప్పలి సైదులును టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చట్టవిరుద్ధంగా గొలుసుకట్టు విధానంతో అమాయకులను సంస్థలో సభ్యులుగా చేర్చుతున్న నేపథ్యంలో అతడిని విచారిస్తున్నారు. సైదులును అదుపులోకి తీసుకున్నారన్న సమాచారంతో సంస్థ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

### సభ్యుల నుంచి వేలాది రూపాయలు వసూలు

సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పలి సైదులు మూడేళ్ల క్రితం పాలకుర్తిలో ఆర్బీఎఫ్ సంస్థను ఏర్పాటుచేసి, గొలుసు కట్టు విధానం అమలుచేశాడు. ఇటీవల ఆర్‌బీఎఫ్ సంస్థ పేరు స్థానంలో హెప్సీబా మార్కెటింగ్ అని బోర్డును ఏర్పాటుచేసి విస్తృత ప్రచారం చేపట్టాడు. సంస్థలో చేరే సభ్యులు రూ.6వేల నుంచి ఎంతైనా పెట్టుబడి పెట్టొచ్చు. ఈ స్కీం ప్రకారం రూ.6వేలు కట్టిన వ్యక్తికి మొదట రూ.2వేల విలువైన నిత్యావసరాల సరుకుల కిట్టు, రెండో నెల నుంచి రూ.1000 చొప్పున 20 నెలలు అందజేస్తారు. ఈ స్కీంను నమ్మి కేవలం ఆరు నెలల్లోనే 10వేల మంది సభ్యులుగా చేరారు. అలాగే, సభ్యుల నుంచి పెట్టుబడులు సైతం పెట్టించాడు. కొందరికి ప్రతీ నెలా వారి అకౌంట్లలో డబ్బులు జమ కావడంతో అత్యాశతో పేదలు అప్పులు చేసి, బంగారం కుదువ పెట్టి ఆర్‌బీఎఫ్(హెప్సీబా)లో పెట్టుబడులు పెట్టారు. గొలుసుకట్టు స్కీం గురించి తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి సంస్థ యజమాని సైదులుతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సంస్థ తీరుపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో పెట్టుబడులు పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఈ యాజమాని చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆర్‌బీఎఫ్ యజమానితో పాటు ఏజెంట్లుగా పని చేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ఎక్స్‌కవేటర్ పట్టివేత, కేసు నమోదు

కనగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బుడమర్లపల్లి గ్రామవాగులో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలను జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌ను మంగళవారం కనగల్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాన్ని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని దళారులను హెచ్చరించారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని పాత శిల్పా హోటల్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పరిసరాల్లో యాచిస్తూ జీవనం సాగిస్తూ మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రామన్నపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకోవడంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. రామన్నపేటకు చెందిన సాల్వేరు అశోక్ బస్సులో ప్రయాణిస్తూ ఫోన్ మరిచిపోయాడు. అనంతరం స్థానిక పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. ఈ క్రమంలో అశోక్‌ను మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ వెంకటేశ్వర్లు అందజేశారు. ఫోన్ రికవరీ చేయడంలో బాధ్యతగా వ్యవహరించిన పోలీస్ టీ.ప్రవీణ్‌కుమార్, వై. ప్రశాంత్‌లను సీఐ అభినందించారు.

# యూరియా కోసం అగచాట్లు

● పలు మండలాల్లో రైతుల రాస్తారోకో ● మరికొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే బారులు

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. పలు మండలాల్లో యూరియా కోసం పడిగాపులు కా యాల్సిన పరిస్థితి నెలకొంది. పీఏసీఎస్ కార్యాలయాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. రాత్రింబవళ్లు యూరియా కోసం ని రీక్షించినా అందకపోవడంతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో మం గళవారం రాస్తారోకో నిర్వహించారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.**

**-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్**

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్ మనగ్రోమోర్‌కు సోమ వారం సాయంత్రం రెండు లారీల యూరియా వచ్చింది. అయితే నిర్వా హకులు రైతులకు ముందస్తుగా సమాచారం కానీ, టోకెన్లు ఇవ్వ లేదు. దీంతో మంగళవారం ఉదయం దాదాపుగా 4 వేల మంది రైతులు మన గ్రోమోర్ దుకాణం వద్ద బారులు తీరారు. వ్యవసాయ అధికారు లు, పోలీసులు, రైతులు స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట టోకెన్ల బారులు తీరా రు. టోకెన్లు పొందిన రైతులకు ఒక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు. టోకెన్ల పంపిణీలో రాత్రి నుంచి వేచి ఉన్న రైతులకు కాకుండా తర్వాత వచ్చిన వారికి టోకెన్లు ఇవ్వడంతో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నెమ్మికల్ -దంతాలపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అధికారు లతో మాట్లాడి అదనపు టోకెన్ల ఇచ్చి యూ రియా లోడ్ వచ్చిన తర్వాత బస్తాలు ఇస్తామని రైతులకు నచ్చచెప్పడంతో రాస్తారోకో విరమించారు.

● మఠంపల్లి : యూరియా పంపిణీలో అధికారులు, మన గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఆందోళ నకు దిగా రు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ యూ రియా కట్టల కోసం రైతులంతా వ్యవసాయ పనులు వదిలి రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరి స్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు యూరి యాను పక్కాదారికి పట్టకుండా చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నారు.



ఆత్మకూర్(ఎస్): నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన రైతులు

● మద్దిరాల : మండల కేంద్రంలోని మనగ్రోమోర్, అగ్రోస్ కేంద్రా లకు 880 బస్తాల యూరియా వచ్చింది. 1100 మంది రైతులు రావ డంతో టోకెన్ల ద్వారా రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా అంద జేశారు.

● అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి పీఏసీఎస్‌కు 600బస్తాల యూరియా రావడంతో రైతులు భారీగా వచ్చారు. ఉదయం 4 గంటల నుంచి క్యూలైన్‌లో నిలిచి యూరియా కోసం ఎదురు చేస్తూ టోకెన్ల ద్వారా యూరియాను తీసుకెళ్లారు. మహిళ రైతులు అధిక సంఖ్యలో క్యూలైన్‌లో ఉండి ఒక్కొక్క యూరియా బస్తా తీసుకెళ్లారు. ఏవో గణేష్, ఎస్‌ఐ సైదులు, ఏఎస్‌ఐ రాంకోటి, కానిస్టేబుల్ త్రివేణి, రమణ, పోలీస్ తో కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు.

● నూతనకల్ : మూడు రోజులుగా యూ రియా రాక పోవడంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం మండల కేంద్రంలోని సూర్యాపేట- దంతాలపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సంద ర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా యూరియా తెప్పించ కుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఎస్‌ఐ రావుల నాగరాజు, అధికారులు రైతులకు యూరియా అంది స్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమింపజేశారు.



మోత్కూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

### యూరియా కోసం బారులు

మోత్కూరు/ఆత్మకూరు(ఎం)/ గుండాల :యాదాద్రిభు వనగిరి జిల్లా మోత్కూరు సింగిల్ విండోకు మంగళవారం యూరియా వచ్చిందని తెలియడంతో మోత్కూరుతో పాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు వచ్చి బారులు తీరారు. సంఘానికి 444 బస్తాల యూరియా రాగా పోలీసుల పర్యవేక్షణలో ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రైతులకు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రైతులకు కొరత లేకుండా యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు రైతులను సముదాయించారు. ఆత్మకూరు(ఎం) సింగిల్ విండో కార్యాలయానికి వారం తరువాత మంగళవారం 444 బస్తాల యూరి యా వచ్చింది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల రైతులు వందల సంఖ్యలో కార్యాలయానికి తరలి వచ్చారు. పోలీసులు వచ్చి రాసి పెట్టిన పేర్ల ప్రకారం పిలిచి రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. యూరియా కొరత పై సీఈవో కిరణ్ మాట్లాడుతూ అడగగా పక్క మండలాల కంటే ఆత్మకూరుకు ఎక్కువ యూరియా తెప్పించానని, కొంత మంది రైతులు ప్రస్తుతం అవసరం లేకున్నా తీసుకుంటున్నారని, మరి కొందరు రైతులు తీసుకుని తమ బంధువులకు పంపుతున్నారని తెలిపారు. దీంతో అవసరం ఉన్న రైతుకు కొంత ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. గుండాలలో రైతులు యూరియాకోసం ఎదురుచూశారు.



నూతనకల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

## తెల్లవారుజాము నుంచే బారులు

కేతేపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి పంట ఎర్రబారిపో తుంది. దీంతో పత్తికి యూరియా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మంగళవారం స్థానిక పీఏసీఎస్‌లోని ఎరువుల విక్రయ కేం ద్రానికి రెండు లారీల (440బస్తాలు)యూరియా వచ్చింది. విషయం తెలిసిన మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో ఉద యాన్నే కేతేపల్లికి చేరుకుని పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు కట్టారు. రైతులు అధిక సంఖ్యలో ఉండడంతో ఒక్కో రైతుకు పట్టా దారు పాసుపుస్తకంపై ఒక్కోబస్తా చొప్పున ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతు లను అదుపు చేశారు. ఆ తర్వాత పీఏసీఎస్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికారులు అతికష్టం మీద పోలీసుల సహకారంతో వరుస క్రమంలో రైతులకు టోకెన్లు ఇచ్చి వాటి ఆధారంగా ఒక్కో యూరియా బస్తా పంపిణీ చేశారు.



శాలిగౌరారం : పెర్కకొండారంలో ఆగ్రో రైతు సేవా కేంద్ర ఎదుట చెప్పులు, రాళ్లు పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

● శాలిగౌరారం : మండలంలో రైతులు నాలుగు రోజులుగా యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. మంగళవారం తెల్లవారుజా మున శాలిగౌరారంలోని సింగిల్ విండోకు 444బస్తాలు, పెర్కకొండా రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి 444 యూరియా బస్తాలు, ఆకా రంలోని ఎన్ఎండీఎస్ కేంద్రానికి 222 బస్తాల లోడ్ వచ్చింది. దీంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద ఎత్తున వచ్చి చెప్పు లు, రాళ్లను పెట్టి బారులు తీశారు. శాలిగౌరారం మండల వ్యవ సాయాధికారి సౌమ్యశృతి తన సిబ్బందితో టోకెన్ ద్వారా రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

● కట్టంగూరు : యూరియా కోసం మంగళవారం మండలకేంద్రంలో తెల్లవారుజాము నుంచి రైతులు బారులు తీరారు. కట్టంగూరులోని రైతు వేదిక వద్ద క్యూలైన్‌లో చెప్పులను పెట్టారు. దీంతో పాటు మహిళా రైతులు కూడా యూరియా కోసం బారులు తీరారు. కట్టంగూరు మండలానికి 444 బస్తాలు రాగా ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసినట్లు ఏవో గిరి ప్రసాద్ తెలిపారు.

## క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాం చారా త్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో నిత్య పూ జలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,22,317 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.



హారతి సమర్పిస్తున్న అర్చకులు

### గాయత్రీదేవిగా అమ్మవారు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ దివ్యక్షేత్రంలో మంగళవారం శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు కొనసాగాయి. ఆలయంలో రెండో రోజు అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఏఈవో రఘు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. సూ ర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రతి సంవత్సరం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి విద్యార్థులందరూ పాఠ శాలలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యా ర్థులకు ఉదయం అల్పాహారం, మధ్యా హ్నాం నాణ్యమైన బోజనం, సాయంత్రం స్నాక్స్‌తో సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలన్నారు. మౌలిక వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలను నాలుగైదు కలిసి ఒకే సముదాయంలో నిర్వహించాలని తద్వారా ఉపాధ్యాయుల కొరత తీరుతుందనే ప్రభుత్వ ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు, నాయకులు టి.లింగారెడ్డి, లింగయ్య, వెంకటేశ్వర్లు, వేణు, ఆనంద్, భాస్కర్, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సోమయ్య

## ధనుజకు తెలంగాణ ఐకాన్ అవార్డు

రామన్నపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ కళా రత్న తెలంగాణ ఐకాన్ అవార్డును యాదాద్రి భువనగిరి రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కళ్లెం ధనుజ అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన వసుంధర వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్ఫూర్తి పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా రావి ఆకులపై వేసిన చిత్రాలకు గాను ధనుజను ఈ అవార్డు వరించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు, ప్రముఖ కవి, విమర్శకుడు, అనువాదకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా పలువురు ధనుజను అభినందించారు.



ఐకాన్ అవార్డు అందుకున్న కళ్యాణ్ ధనుజ

## 27న ఉమ్మడి నల్లగొండ జిల్లా తైక్వాండో పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా తైక్వాండో అండర్ -14, 17 బాల, బాలిక క్రీడా పోటీలు ఈనెల 27వ తేదీన నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దగ్గుపాటి విమల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాధాకారి ఆదేశాల మెరకు జిల్లా స్థాయి తైక్వాండో పోటీల నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, ఇతర వివరాల కోసం 9703269840 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జస్వంత్

కనగల్, సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి):44వ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు నల్లగొండ జిల్లా కనగల్ మండలం కురంపల్లి గ్రా మానికి చెందిన తలారి జస్వంత్ ఎంపిక య్యారు. జస్వంత్ చండూర్ సాంఘిక గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. కాగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జస్వంత్‌ను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌జనరల్ సెక్రటరీ వి.రమణ, జిల్లా సెక్రటరీ భయ్యన్నస్వామి, కోచ్‌దేవేందర్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. తమిళనాడు రాష్ట్రంలోని డిండిగల్‌లో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు.



## పెద్దవూరలో రైతుపై చేయి చేసుకున్న హోంగార్డు

● తొక్కిసలాటలో సొమ్మసిల్లిన మహిళ

పెద్దవూర : మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద మంగళవారం ఉదయం నుంచి పురుషులు, మహిళలు వేర్వేరు క్యూలైన్‌లో బారులు తీరారు. ఈ క్రమంలో చలకుర్తి గ్రామానికి చెందిన ఇస్రాది శ్రీనివాస్ లైన్ మధ్యలో చేరగా అక్కడే డ్యూటీలో ఉన్న హంసినాయక్ అనే హోంగార్డు అతడిని కొట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా అడిగిన రైతులను పోలీసులతో కొట్టిస్తారా అని వాపోయారు. కాగా క్యూలైన్‌లో జరిగిన స్వల్ప తొక్కిసలాటలో గేమ్యానాయక్ తం డాకు చెందిన లక్ష్మి సొమ్మసిల్లింది. దీంతో ఆమె ను స్థాని కులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా మంగళవారం మూడు లారీల్లో 1110 బస్తాల యూరియా వచ్చిందని, వచ్చిన యూరియాను అంతా వేచి ఉన్న రైతులకు టోకెన్లను జారీ చేసి పోలీసు బందోబస్తు మధ్య ఎప్పటికప్పుడు అందిస్తున్నామని ఏవో సందీప్ కుమార్ తెలిపారు.



సొమ్మ సిల్లిన మహిళ

# మేనిఫెస్టో ప్రకారం పింఛన్లు పెంచాల్సిందే..

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మునుగోడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఆసరా పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. నల్ల గొండ జిల్లా మునుగోడు మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పింఛన్‌దారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు పింఛన్ రూ. 4వేలు చొప్పున పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరుస్తూ హామీ ఇచ్చారని వివరించారు. 22నెలలు గడిచినా ఇచ్చిన హామీ మాత్రం ఆచరణకు నోచుకోవటం లేదన్నారు. గతంలో 200 ఉన్న పెన్షన్ రూ. 2వేలకు తెచ్చిన ఘనత ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమేనన్నారు. పేదల వైద్యం కోసం ఆరోగ్య శ్రీ పథకం అమలు చేసిన ఘనత సైతం తమదే అని స్పష్టం చేశారు. ఉద్యమాలతోనే ప్రజల హక్కులు సాధించుకోవటం సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, అర్హులకు కొత్త పింఛన్లు మంజూరుచేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 6నుంచి నవంబరు 6వ తేదీ వరకు నెల రోజుల పాటు అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ ఎదుట దర్నా కార్యక్రమాలు, ఆతర్వాత అక్టోబరు 20న చలో సెక్రటరేట్ ముట్టడి నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, భారత వికలాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, ఉపాధ్యక్షుడు ఒంటెపాక ముత్యాలు, మునుగోడు, చండూరు మండల సమితిల అధ్యక్షుడు తలారి సహదేవులు, ఆకారపు వెంకన్న, కారింగ్ రేణుక, జాల భాగ్యలక్ష్మి బొమ్మకంటి శ్రీకాంత్, మేడి శంకర్, గోపాల్, శ్రీనివాస్, అంజయ్య, వెంకన్న, పందుల మల్లేష్, సంపత్, యాదయ్య పాల్గొన్నారు.

● హాలియా : పింఛన్‌దారులకు న్యాయం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం హాలియాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోకవర్గ చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. 2023 ఎన్నికల సమయంలో నవంబర్ నెలలో తనకు ఓటు వేసి, డిసెంబర్‌లో పెరిగే పెన్షన్లు తీసుకోవాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఓట్లు దండుకున్నాక దారుణంగా మోసం చేశారన్నారు. పెన్షన్లు పెంచడమో లేదా ప్రభుత్వం దిగిపోవడమే తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్ల గురించి మాట్లాడకుండా కేసీఆర్ మౌనం వహించడం దుర్మార్గమని, ప్రతి పక్ష పార్టీగా బీఆర్ఎస్ పెన్షన్‌దారుల పక్షాన నిలవడంలో విఫలమైందన్నారు. రేవంత్, కేసీఆర్ పేద వర్గాలకు చెందిన వాళ్లు కాదు కనుక పేద వర్గాలకు చెందిన పెన్షన్‌దారుల గోడు పట్టడం లేదని విమర్శించారు. వీహెచ్‌పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు చైతన్యరెడ్డి అధ్యక్షత వహించగా మండల అధ్యక్షులు బాలకృష్ణ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద్‌మాదిగ, రాష్ట్ర సమన్వయకర్త జానకిరామయ్య, జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, మండల అధ్యక్షుడు పోలేని యాదయ్య, గార్లపాటి ప్రసాద్‌మాదిగ, గడుసు సైదీష్‌మాదిగ, తరి ఏడుకొండలు, ఏర్పుల వెంకటయ్య, మడుపు శ్రీనివాస్, కళ్యాణ్, రాజు, లక్ష్మి, ఇందిర, కమలమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.



హాలియా సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# మూసీకి పోటెత్తిన వరద ..9 క్రస్ట్ గేట్లతో నీటి విడుదల



మూసీ 9 క్రస్ట్ గేట్లతో విడుదలవుతున్న వరద

కేతేపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఈ ఏడాది మరోసారి వరద పోటెత్తింది. 10 రోజులుగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా మూసీ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి మంగళవారం ఉదయం నుంచి మూసీకి వరద పోటెత్తింది. ఉదయం 8,368. 84 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రాజెక్టు అధికారులు ఇన్‌ఫ్లోకు అనుగుణంగా 6 క్రస్ట్ గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువ నీటిని విడుదల చేస్తూ వస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 12184.84 క్యూసెక్కులకు పెరిగింది. అప్రమత్తమైన అధికారులు. సిబ్బంది మరో మూడు క్రస్ట్ గేట్లను సైతం రెండు అడుగులు ఎత్తి మొత్తం 9 క్రస్ట్ గేట్లను 2అడుగుల మేర ఎత్తడం ద్వారా ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు సరిపడ వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రాత్రి వరకు ఇన్‌ఫ్లో ఇదేరీతిలో కొనసాగుతూ వచ్చింది. 645 అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజె క్టు ప్రస్తుత నీటిమట్టం 643.90 అడుగులు(4.17టీఎంసీ)లుగా ఉంది. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 386.64 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. .

### పరవళ్లు తొక్కుతున్న మూసీ

శాలిగౌరారం : హైదరాబాద్‌లో మూసీ నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా రావడంతో మూడు నెలల నుంచి అనేక పర్యాయాలుగా మూసీ ఉధృతి పెరుగుతోంది. నల్ల గొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య 10 అడుగుల లోతు నుంచి మూసీ పరవళ్ల తొక్కుతోంది. మండలంలోని ఉప్పలంచ, మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల సరిహద్దులో మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో నది తీర ప్రాంతాల్లో వరి పంట అక్కడక్కడ నీట మునిగింది.

### సాగర్ 26క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీటి విడుదల మంగళవారం కూడ కొనసాగుతుంది. సాగర్‌ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 586.50 అడుగులు(302.9125టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9.500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వార 3549 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్‌కేంద్రం ద్వార 33495 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 24 వందల క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 3 వందల క్యూసెక్కుల నీటిని 26 క్రస్ట్ గేట్లలో 12 గేట్లను 5 అడుగుల మేరకు 14 క్రస్ట్ గేట్లను పది అడుగుల మేరకు ఎత్తి 293262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 34,2506 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి అంతే మొత్తంలో నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



నాగార్జున సాగర్ 26 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

## అద్దె వాహన డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

నల్లగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖలో పనిచేస్తున్న అద్దె వాహన డ్రైవర్లు ఆ శాఖ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏడు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంచం శ్రీనివాస్, కోటి ముత్యం, శంకర్, ఎస్‌కె. నజీర్, శ్రీశైలం, సత్తార్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి ****

నల్లగొండ

నకిరేకల్, మునుగోడు




## సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. అడ్లూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, భూపతి అంజయ్య, గూని వెంకటయ్య, బోడ విజయ్‌కుమార్, భూపతి వెంకన్న, వేముల గోపీనాథ్, ఇంద్రకంటి యాదయ్య, తోటకూరి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## మేకల అభినవ్ విగ్రహం ఏర్పాటుకు కృషి



అభినవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న గోనారెడ్డి తదితరులు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆసియా చెస్ ఛాంపియన్ దివంగత మేకల అభినవ్ విగ్రహాన్ని నల్లగొండ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈవో మారం గోనారెడ్డి అన్నారు. మేకల అభినవ్ 24వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన వర్ధంతి సభలో మాట్లాడారు. చిన్న వయస్సులో ఆసియా క్రీడలో చెస్ ఛాంపియన్‌గా నిలిచి ప్రమాదవశాత్తు చనిపోయాడని గుర్తుచేశారు. దేశకీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మేకల అభినవ్ విగ్రహం నల్లగొండలో లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో అభినవ్ గురువు, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొనసం కరుణాకర్‌రెడ్డి, డీవైఎస్‌వో అక్బల్ అలీ, చెస్ అర్బిటర్ మేడం ప్రభాకర్, తీగల శంకరయ్య, యువజన శాఖ సూపరింటెండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

కేతేపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈ నెల 25న నిర్వహించే మధ్యాహ్న భోజన ఏజన్సీ కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని మధ్యాహ్న భోజన ఏజన్సీల కార్మికులతో జరిగి సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా మధ్యాహ్న భోజన ఏజన్సీల కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ళ సుధీర్, నాయకులు పెంజర్ల సైదులు, ఎల్. రాజు, కోనేటి ముత్తమ్మ, వసంత, జ్యోతి, స్వరాజ్యం, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



వట్టె జానయ్యయాదవ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

కేతేపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బీసీలు ఉద్యమించాలని టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి వట్టె జానయ్య అన్నారు. చీకటిగూడెం మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, నాయకులు చిమట ఉపేందర్, చీకటిగూడెం, వెంబడి రమేష్, కోట పూర్ణచందర్, కోట వీరయ్య, కుంచం అంజి, కీసర నాగరాజు, ముత్తినేని శ్రీనివాస్, గోపయ్య టీఆర్పీలో చేరారు. బీసీలందరినీ ఏకతాటిపైకి తేవడానికి టీఆర్పీ కృషిచేస్తుందన్నారు.

## గీత కార్మిక సంఘాలకు భూమి కేటాయించాలి

చిట్యాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గీత కార్మిక సంఘాలకు ఐదు ఎకరాల భూమి కేటాయించాలనీ గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చౌగోని సీతరాములు డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాలలో జరిగిన సంఘం మండల మహాసభలో మాట్లాడారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమ నల్లగొండ జిల్లాలో ఏర్పాటుచేసి గీత కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి గీత కార్మికుడికి ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామునగుల్ల అచ్చాలు, మామిడి హనుమంతు, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, గునుగుంట్ల కృష్ణయ్య, బూరుగు శ్రీను పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ పిలుపు నిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఐద్వా జాతీయ మహాసభల కరపత్రాలను మంగళవారం స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాలాక్షి, ప్రశాంతి, గౌసియా, సరోజ, అనురాధ పాల్గొన్నారు.

చిట్యాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ కోరారు. మంగళవారం చిట్యాలలో కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 25వ తేదీ నుంచి 28వరకు హైద్రాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐద్వా పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు చెన్నోజు నాగమణి, పన్నాల శశికళ, మేడి సరిత, మమత, కల్పన, అనిత తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టు ఇలా.. వెళ్లేదెలా?

● మరమ్మతులకు నోచని కల్వర్టు ● రోడ్డుపై నిలుస్తున్న నీరు ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



మర్రిగూడలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో చెరువును తలపిస్తున్న కల్వర్టు

మర్రిగూడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే కల్వర్టు ప్రాంతమంతా నీటితో నిండి కుంటలా మారుతుంది. అక్కడి నుంచి వెళ్లేందుకు వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో రైతు వేదిక సమీపంలో ఉన్న కల్వర్టు మరమ్మతులు నోచుకోలేక అధ్వానంగా మారింది. నీటితో నిండి కల్వర్టు కుంట కట్టగా మారింది. ఎంపీడీవో, ఇందిరా కాంతి పథకం, ఉపాధి హామీ పథకం, వ్యవసాయం కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ప్రజలు, రైతులు మహిళా సంఘల వారు పనుల నిమిత్తం నిత్యం కార్యాలయాలకు వెళ్తుంటారు. ఈ దారినుంచే వట్టిపల్లి గ్రామానికి వెళ్లాలి. ప్రమాదకరంగా మారిన కల్వర్ట్ వల్ల చౌరస్తా నుంచి రెండు కిలోమీటర్లు దూరం నుంచి చుట్టూ తిరిగి కార్యాలయాల వద్దకు రావల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంటకట్టగా మారిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బీజేపీ ఫ్లెక్సీలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే 20 రోజులైనా తొలగించనప్పుడు బీజేపీ ఫ్లెక్సీలను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఫ్లెక్సీలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పకీర్ మోహన్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, గడ్డం మహేశ్, వెంకటేశ్వర్లు, సైదులు, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మర్రిగూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎర్ర గుమ్మడి తెగులు సోకి నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బట్లపల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. రైతులు ఆరుగాలంపాటు శ్రమించి పంట చేతికొచ్చే తరుణంలో వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి పంటకు ఎర్ర గుమ్మడి తెగులు సోకి పూర్తిగా ఎండిపోయాయన్నారు. దీంతో పత్తి రైతులు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. మండలంలో వేలాది ఎకరాలు ఎర్ర గుమ్మడి తెగులు సోకడం వల్ల రైతుల కోలుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. మండలంలోని రెవెన్యూ వ్యవసాయ అధికారులు స్పందించి ఎర్ర గుమ్మడి తెగులు సోకి ఎండిపోయిన పత్తి సాగు పంటలను పరిశీలించి ఎంత నష్టం వాటిని సర్వే చేసి పంట నష్టం పై నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా రైతు కార్యదర్శి బండ శ్రీశైలం, ఐలయ్య, సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సలోజు రామలింగ చారి, నీలకంఠ ఉన్నారు.

## ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారిగా లచ్చిరాం



రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఉదావత్ లచ్చిరాం ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో మంగళవారం జరిగిన సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. మర్రిగూడ మండల ప్రాథమిక పాఠశాల దామెర భీమనపల్లి ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

## మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదులు

కట్టంగూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సైదులు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్ర నాలుగో మహాసభలో ఎన్నికయ్యారు. మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సైదులు తెలిపారు.

## ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక రోగాలు నయం



మందులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో దీర్ఘ రోగాలు నయమవుతాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 8,9వ వార్డుల్లో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగా హన కల్పించారు. ధన్వంతరి మానవ జాతికి ఆయుర్వేద జ్ఞానాన్ని అందించారని అందుకే హలోపతి వైద్యులు సైతం ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముతారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుహాసిని, రుచిత, డీపీఎం కళ్యాణ్, ఫార్మసిస్టు మారబోయిన చంద్రయ్య, ముంజునాథ్ శ్రీవాణి, సింగం ప్రవీణ్, ప్రసాద్, కోమల, వైష్ణవి, అర్జున్ ఉన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ నరసింహ్మారావు అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక విద్యలో సాధించిన ప్రతిభ ప్రశంసనీయమన్నారు. వారి కృషి కళాశాల ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్తుందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలతో దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు ప్రదానం చేశారు.

## 'కూలిన ఇళ్లను గుర్తించి ఆదుకోవాలి'

చిట్యాలరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వర్షాలకు కూలిన ఇళ్లను గుర్తించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. మండలం వట్టిమర్తిలో వర్షాలకు సోమవారం రాత్రి కూలిన మాజీ సర్పంచ్ బూరుగు కృష్ణవేణి ఇంటిని మంగళవారం పరిశీలించారు. వర్షాలకు పాత ఇళ్లు తడిసి కుంగి దెబ్బతిని కూలుతున్నాయన్నారు. ఇళ్లు కూలిన వారికి ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూరుగు కృష్ణవేణి, రాచకొండ శ్యాంసుందర్, బూరుగు విజయ్‌కుమార్, సిరిపంగి యాదదయ్య, కొంపల్లి రమేష్, నరేందర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం కుటుంబానికి అండగా ఉంటాం

మునుగోడు రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుటుంబానికి అండగా ఉంటామని డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలం కొంపల్లిలో ఇటీవల గ్రామానికి చెందిన యువరైతు దాసరి శ్రీశైలం మృతి చెందాడు. మంగళవారం ఆయన ఇంటికి వెళ్లికుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకటేశ్వర్లు, మక్కెన అపా రావు, మాదరగోని యాదయ్య, యాదయ్య ఉన్నారు.

మునుగోడు రూరల్: నియోజకవర్గంలో పేదవారికి ఆపద వస్తే ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ ఆదుకుంటుందని డైరెక్టర్ ఇరుగుదిండ్ల అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన మేడి యాదగిరి ఇటీవల చనిపోయాడని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగుదిండ్ల అశోక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బండమీది కిరణ్ కుమార్, పుల్కరం సైదులు, దుబ్బ అనిల్, ఏర్పుల స్వామి, బాలకృష్ణ, నాతి లింగస్వామి, అబి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చండూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ మునుగోడు ప్రాజెక్టు సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. చండూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. పోషక విలువలు ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని, చిన్నా రులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ యాదయ్మ, సునీత, కేదారి, జగదీశ్వరి, విజయనిర్మల, మునిషా, సునీత, సరస్వతి, సంధ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

## కవి బైరెడ్డి కృష్ణారెడ్డికి కీర్తి పురస్కారం

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కీర్తి పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో నల్లగొండ పట్టణానికి చెందిన కవి బైరెడ్డి కృష్ణారెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆయనకు పురస్కారం అందజేశారు. కృష్ణారెడ్డిని సాహితీవేత్తలు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, తండు కృష్ణకౌండిన్య, పెరమాళ్ల ఆనందర్, మునాస వెంకట్, సాగర్ల సత్తయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, మాదగాని శంకరయ్య, రామకృష్ణ, శీలం భద్రయ్య తదితరులు అభినందించారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బస్సు సౌకర్యం లేకపోవడంతో మండలంలోని పేరేపల్లి గ్రామంలోని ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. చిట్యాల మండం పేరేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామంలో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట లింగస్వామి, కూనూరు గణేష్, గోలి సాయికిరణ్, శవగాని కరుణాకర్, అంజయ్య, యాదయ్య పాల్గొన్నారు.



# అదే ఉత్కంఠ

*రంగంలోకి దిగేందుకు సిద్ధమైన నేతలు*


(5వ పేజీ తరువాయి)


రిజర్వేషన్ కేటాయింపు విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా గత రిజర్వేషన్లు దాదాపు ఉండవని, ఎక్కడైనా స్వల్ప సంఖ్యలో స్థానాలకు ఆయా సామాజికవర్గాల జనాభా అత్యధికంగా ఉన్నచోట రిజర్వేషన్ సైకిల్ ప్రకారం అనివార్యమైతే తప్ప మారుతాయనే సంకేతాలతో సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నారనే సమాచారంతో పలువురు నాయకులు వారి స్థానాలు అనుకూలంగా వచ్చేందుకు అవకాశాలున్నాయోమేనని ప్రయత్నాలు చేశారు. ఆయా స్థానాలు ఏ వర్గానికి దక్కుతున్నాయనే అంశంపై ఆరా తీసేందుకు ప్రయత్నించారు.

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో పోటీచేసి గద్దె ఎక్కాలని తహతహలాడుతున్న ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులంతా రిజర్వేషన్ల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటనకు ముందే రిజర్వేషన్లు ప్రకటించనుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15, బీసీలకు 25, మహిళలకు అన్ని కేటగిరీల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఈసారి ఎస్సీ, ఎస్టీలు, మహిళా రిజర్వేషన్ల శాతాలు యథావిధిగా కొనసాగుతుండగా, బీసీలకు 25 నుంచి 42శాతానికి పెరుగుతుంది. ఇప్పటికే గ్రామాలు, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# పొమ్మన లేక పొగబెట్టారు!


(5వ పేజీ తరువాయి)


పంపారు. డీఎంహెచ్‌వోల పరిధిలో 12 ఏళ్లుగా పనిచేస్తున్న 104 ఉద్యోగులను వివిధ విభాగాల్లో సర్దుబాటు చేయడం, వేతనాలు పెంచకపోవడం, డ్రైవర్లను మెడికల్ కళాశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా నియమించడం ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నెల 24 నుంచి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే బడ్జెట్‌లేని డిపార్ట్‌మెంట్‌లో సర్దుబాటు చేయడం అక్కడ ఆందోళన చేస్తే మరో విభాగానికి పంపిస్తూ ఉన్నతాధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో 12ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## గాయత్రీదేవిగా అమ్మవారు





చిట్యాల మండలం నేరడలో పూజల్లో పాల్గొన్న భక్తులు



నల్లగొండలో...



నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు




కనగల్‌లో...

# ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
| --- | --- | --- | --- | --- |
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 586.50 (302.9125) | 3,42,506 | 3,42,506 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.90 (4.17) | 12,184.84 | 12,184.84 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 170.831 (39.5561) | 2,89,300 | 3,14,300 |

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

# అదే ఉత్కంఠ



- రిజర్వేషన్లపై ఆరా తీస్తున్న నాయకులు
- తొలుత బీసీ రిజర్వేషన్లపై జీవో
- వెనువెంటనే రిజర్వేషన్ల స్థానాల ప్రకటన
- నేడో, రేపో ప్రకటన వస్తుందనే సమాచారం
- ఆ తరువాత ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం
- ఇప్పటికే కసరత్తు పూర్తిచేసిన ఎన్నికల సంఘం

నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుండడంతో రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 24 తరువాత ఏ క్షణమైనా బీసీ రిజర్వేషన్లకు ప్రత్యేక జీవో విడుదల చేస్తారని, వెనువెంటనే వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్‌పర్సన్ పదవులకు రిజర్వేషన్లను ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ నెల 22 అర్ధరాత్రి ఆర్డీవోలు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు రిజర్వేషన్లను ఖరారు చేయగా, 23న కలెక్టర్లు జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్లను నిర్ణయించి సీల్డ్ కవర్ ఉంచి, పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అధికారులు రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. వెనువెంటనే ఒకటి, రెండు రోజుల తేడాతో పరిషత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని ఉన్నతస్థాయి అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### రిజర్వేషన్లపై నాయకుల ఆరా

ప్రభుత్వం తాజాగా సూచించిన మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్లను ఆర్డీవోలు, కలెక్టర్లు నిర్ణయించారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రిజర్వేషన్ల వివరాలను వెల్లడించకుండా గోప్యత పాటిస్తుండడంతో జిల్లాలో ఏ స్థానాలు, ఏ కేటగిరీకి దక్కాయనే ఆసక్తి నాయకుల్లో కనిపించింది. బీసీలకు గత ఎన్నికల్లో 25శాతం ఉంటే, ఈసారి అది 42 శాతానికి పెరగడం, గత రిజర్వేషన్ల సైకిల్‌ను ఈసారి అమలు చేయకుండా 2008లో అనుసరించిన మిగతా 8వ పేజీలో...

### యంత్రాంగం సన్నద్ధం

పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లాలో కొత్త, పాత కలిపి మొత్తం 73 మండలాల్లో 73 జడ్పీటీసీ స్థానాలు, 1,730 పంచాయతీల్లో 17,500కుపైగా వార్డు స్థానాలు, 723 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఎంతవరకు అవసరమవుతారనే అంశంలో ఇప్పటికే ప్రాథమికంగా సమాచారం సిద్ధం చేశారు. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో, అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ గుర్తులను ఇప్పటికే సిద్ధం చేశారు. రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలనే అంశంపై ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్న మేరకు రిజర్వేషన్ల కోటా, కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ముందుగా పరిషత్‌లకు, తదుపరి పక్షం రోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల నిర్వహణపై పోలీస్‌శాఖ సైతం ముందస్తు సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సున్నిత ప్రాంతాలు, అతి సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించే పనిని పోలీస్‌శాఖ నిర్వహిస్తోంది. ఈ జాబితా తయారుచేసుకొని అవసరమైన పోలీస్ బలగాలను అందుబాటులో ఉంచేలా ప్రాథమిక కసరత్తు చేస్తోంది.

# పొమ్మన లేక పొగబెట్టారు!

- మెడికల్ కళాశాలల్లో 104 ఉద్యోగుల సర్దుబాటు
- ఇప్పటికే ఆరు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు
- తాజాగా దూరప్రాంతాలకు బదిలీచేస్తూ ఉత్తర్వులు



నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 104 అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో సర్దుబాటు చేసింది. ఇప్పటికే ఆరు నెలలుగా వేతనాలు రాక ఉమ్మడి జిల్లాలోని 120మంది అవుట్ సోర్సింగ్ 104 ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 104 వాహనాలు గత ఏడాదిగా పనిచేయకపోవడంతో ఈ విభాగంలో విధులు నిర్వహించే ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆపరేటర్లు, డ్రైవర్లను డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు మలేరియా, ఎన్‌సీటీ విభాగాలల్లో సర్దుబాటు చేశారు. వీరంతా రెగ్యులర్ ఉద్యోగుల్లా బాధ్యతలు నిర్వహిస్తున్నా, ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కాగా, వేతనాల కోసం కొద్ది రోజులుగా వీరు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో తాజాగా, మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కేవలం రూ.17వేల నుంచి రూ.20వేలలోపు వేతనం ఉన్న వీరందరినీ దూర ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కళాశాలలకు బదిలీ చేశారు. దీంతో పొమ్మన లేక పొగపెట్టారని 104 ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 70మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. సూర్యాపేట జిల్లాలో పనిచేసే 104 ఉద్యోగులను ఖమ్మం జిల్లాకు, నల్లగొండలో పనిచేసే 12మందిని యాదాద్రి జిల్లాకు బదిలీచేశారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని కొంతమందిని మహబూబ్‌నగర్‌కు సైతం బదిలీచేసినట్టు తెలిసింది. సుమారు 100కి.మీలకు దూరంగా ఉన్న మెడికల్ కళాశాలలకు మిగతా 8వ పేజీలో...

## సన్న బియ్యం పథకం ఎలా ఉంది?

### వ్యాపారులను ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎం భట్టితో నార్కట్‌పల్లి వ్యాపారులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత సన్న బియ్యం పథకం అమలు తీరు ఎలా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాపారులను ఆరా తీశారు. ఆయన మంగళవారం 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో నార్కట్‌పల్లిలోని ఓ హోటల్ వద్ద అల్పాహారానికి ఆగారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన నార్కట్‌పల్లికి చెందిన పలువురు రైస్ మిల్లుల యజమానులు డిప్యూటీ సీఎంను చూసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో మీరేం చేస్తారంటూ వారిని అడిగి తెలుసుకున్న డిప్యూటీ సీఎం ఉచిత సన్నబియ్యం పంపిణీతో మీ బియ్యం వ్యాపారాలు ఎలా ఉన్నాయని అడిగారు. సన్నబియ్యం పంపిణీతో బియ్యం వ్యాపారం తగ్గిందని వారు డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన్ను కలిసిన వారిలో దోసపాటి ప్రసాద్, పసునూరి శ్రీనివాస్, అమరవాది రాములు, దోసపాటి రఘు, వడ్డెగోని రామలింగం, ప్రజ్ఞాపురం రాములు, తదితరులు ఉన్నారు.

# ప్రతిపక్ష పార్టీలకు ఒక్క సీటూ రాదు

- కండువా మోసే కార్యకర్తలే పార్టీకి బలం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో ప్రతిపక్ష పార్టీలకు ఒక్క సీటు కూడా దక్కకుండా కాంగ్రెస్ నెంబర్ వన్‌గా నిలుస్తుందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ నల్లగొండ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కండువా మోసే కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. కాంగ్రెస్ పాదయాత్రతో, ప్రజా చైతన్యంతో ఏర్పడిన ప్రభుత్వం, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతీ వర్గానికి అండగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేర్చే బాధ్యత ముఖ్య నేతలపైనే ఉందన్నారు. నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తానని విద్య, వైద్యంలో మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తొమ్మిది నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంజీయూలో న్యాయవిద్య, ఫార్మసీ కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. డిండి, బ్రాహ్మణవెల్లెంల పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని, కాల్వల లైనింగ్ పనులు వేగంగా పూర్తిచేస్తామని, చెరువులు నింపి రైతాంగానికి బాసటగా నిలుస్తామన్నారు. రోడ్లు, కాల్వలు, కళాశాలలు, ఆస్పత్రులు, ప్రాజెక్టులు ఏది చూసిన నల్లగొండ మోడల్ అనేలా చేస్తానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 100శాతం కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, తిప్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, సైదులు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కూసుకుంట్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలైంది

బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలైందని, అది మునిగిపోయే నావ అని తాను ఏనాడో చెప్పానని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే అవినీతి జరిగిందని మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత చెబుతున్నారని, వారి అవినీతికి అంతే లేదన్నారు. కాళేశ్వరం, ధరణి పేరుతో లక్షల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లాలో ఓ లిల్లీపుట్ ఉన్నాడని, అతడు ఎప్పుడూ గెలిచినా రెండు వేలలోపు మెజార్టీయేనన్నారు. భవిష్యత్తులో ఆయన మరోసారి గెలవబోడన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి ఏనాడూ ఎంజీయూలో అడుగుపెట్టిన దాఖలాలు లేవని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ లక్షల కోట్ల అప్పు పెట్టినా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు.

## సిబ్బంది సంక్షేమానికి కృషి

### ఎస్పీ శరత్‌చంద్ర పవార్



పోలీస్ సిబ్బందితో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి ఉలెన్ జాకెట్‌లు, రెయిన్ కోట్‌లు, కిట్ బ్యాగులు, జంగిల్ ప్యాచ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు, స్పెషల్ పార్టీ సిబ్బంది వర్షకాలం, చలికాలం విధి నిర్వహణలో ఇబ్బంది కలగకుండా జాకెట్లు, రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు శ్రీను, సంతోష, ఆర్ఎస్‌ఐలు కల్యాణ్‌రాజ్, రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి.సలీం డిమాండ్ చేశారు. మంగళవారం దొడ్డికొమరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 2,500 మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. అందులో 552 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసి నేటికీ ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పేదలపై ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో నిర్మించిన 552 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లాటరీ ద్వారా ఎంపికైన వారికి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల పద్మ, సరోజ, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు



లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నేత సిహెచ్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులపై కన్నేసి కాజేయాలని చూస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న బీమా పథకాన్ని జీవో 12ద్వారా ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు ఇచ్చేందు యత్నిస్తోందన్నారు. రూ.346.36కోట్లు యాక్సిస్ లైఫ్ ఇన్సురెన్స్, ఎర్గో జనరల్ ఇన్సురెన్స్ కంపెనీలకు చెల్లించడం ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతుందని, దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నాలో నాయకులు కేశవులు, రవీందర్, సైదాచారి, సైదులు, పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

మర్రిగూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లెంకలపల్లి, శివన్నగూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. శివన్నగూడ పంచాయతీ కార్యాలయంలో ఇందిరా క్రాంతి పథకం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరా క్రాంతి పథకం అధికారులు నూతన సంఘాలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సెర్ప్ ద్వారా రుణాలు అందించి వారు ఉపాధి పొందేలా చూడాలన్నారు. అదేవిధంగా రుణాలను రికవరీ లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు పథకాలను సద్వినియో గం చేసుకునేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పశువులు, కోళ్లు, గొర్రెల షెడ్లను, నర్సరీలను పరిశీలించారు. ఆయ న వెంట ఏపీవో జయరాజు, ఈసీ వివేక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు లక్ష్మి, తదితరులు ఉన్నారు.


మూసీ ప్రాజెక్టుకు
## పోటెత్తిన వరద
- తొమ్మిది గేట్ల ఎత్తివేత
- సాగర్ 26 గేట్ల నుంచి నీటి విడుదల

7

యూరియా కోసం
## అవే అగచాట్లు
- అంతటా తెల్లవారుజాము నుంచే రైతుల బారులు

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● బుధవారం 24 సెప్టెంబరు 2025

## బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పాలనా ముగిసి చాలాకాలం కావడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇప్పటికైనా బిల్లును ఆమోదించి స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేయాలన్నారు.

## బాధితురాలికి ఆర్థిక సాయం

డిండి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రానికి చెందిన మహిళ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మంగళవారం విషయం తెలుసుకున్న డిండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్ వైద్య ఖర్చులకుగాను రూ.10వేల నగదు ఆర్థిక సహాయాన్ని ఆసుపత్రికి వెళ్లి కుటుంబసభ్యులకు అందజేశారు.

## మానవ సేవే మాధవ సేవ



దుస్తులు పంపిణీ చేస్తున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని సామాజిక కార్యకర్త, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ అన్నారు. వృద్ధ, వికలాంగులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎవరికి వారుగా తమ శక్తి కొద్ది దానధర్మాలు చేయాలన్నారు. అనార్తులు, ఆపన్నహస్తం కోసం ఎదురు చూసేవారికి సేవచేస్తే దేవుని అనుగ్రహం పొందొచ్చన్నారు. ఫెయిత్ బంజారా ఆశ్రమంలో అనాధలకు ఆశ్రయమిస్తున్నామని, విద్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, జనార్ధన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాల్లో టపాసుల దుకాణాలు వద్దు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణాలపై ఆంక్షలు విధించాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయడం సబబేనని, అయితే ఆయా దుకాణాలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా వ్యాపారులకు సూచించాలన్నారు. ప్రమాదాలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగేలా దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా, ఫైర్ సేఫ్టీ ఉండేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సురేష్, లక్ష్మణ్, రమేష్, రాజు, నెహ్రూనాయక్, బంగారి, బిచ్చు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హాలియా,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని నాగార్జునసాగర్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజహార్ మొయినుద్దీన్ అన్నారు. మంగళవారం హాలియాలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పేరుతో ఒంటరి మహిళలు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు ఆనాథ మహిళలలకు రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. రేవంతన్నా కా సహారా కింద ఫకీర్, దూదెకుల వంటి వెనుకబడిన వర్గాలకు లక్షల గ్రాంట్‌తో మోపడ్స్ ఇస్తుందన్నారు. అక్టోబరు 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రెండు పథకాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టి స్వయం ఉపాధి పొందేలా ఇందిరమ్మ యోజన తోడ్పడుతుందన్నారు.

## వ్యాపార ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి



హాలియా, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీలోని వ్యాపారులందరూ తమ వ్యాపార ట్రేడ్ లైసెన్స్ ఫీజును చెల్లించి రశీదు పొందాలని హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే అక్టోబరు 1వ తేదీ నుంచి 50 శాతం పెనాల్టీ జమఅవుతుందని కవుఅన వ్యాపారస్థులు తమ వద్దకు వచ్చే బిల్ కలెక్టర్‌కు కానీ మున్సిపాలిటీ కార్యాలయంలో కానీ లైసెన్స్ ఫీజును చెల్లించి రశీదు పొందాలని కోరారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దామరచర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి భైరం దయానంద్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు అందక అప్పులు తీసుకొచ్చి మరీ విద్యార్థులకు వండి పెడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.26వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈనెల 25న నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఏర్పాటు చేస్తున్న మహాసభకు మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె. సుభాని, రుక్యా, కమలమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవిగా అమ్మవారు



వేములపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



దేవరకొండ మార్కెండేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరకొండలో..



కొండమల్లేపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



చింతపల్లి: వీటీనగర్ శివాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం



దశరథమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

చింతపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి మాతృమూర్తి దశరథమ్మ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. రైతులు చెమటోడ్చి వేసిన పంటలకు సకాలంలో యూరియా అందించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమూర్తి లింగయ్య, మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ మల్లిఖార్జున్ రెడ్డి, కేతావత్ బిల్యానాయక్, టీవీఎన్ రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, చింతపల్లి సుభాష్, బాదేపల్లి పులిరాజ్‌గౌడ్ నిరంజన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన

దామరచర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటకు సోకిన తెగుళ్ల నివారణపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ టి. కిరణ్‌బాబు, అరుణశ్రీ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన కేఎన్ఎం 1638రకం వరి పంటలో ఆకుచుట్టు పురుగు, పాము పొడ, సుడిదోమ తెగళ్ల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. నాణ్యతగల ఈ వరి విత్తనాలను రైతులు సాగు చేసుకొని వచ్చే సీజన్‌లో విత్తనాలుగా ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రుషేంద్రమణి, ఏఈవోలు పార్వతి, సైదులు, నరేష్, రైతులు ప్రభాకర్‌రావు, సైదులు, భీమానాయక్ పాల్గొన్నారు.

# బుద్ధవనంలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో వస్తున్న మహిళలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బుద్ధవనంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాగర్ పైలాన్ హిల్‌కాలనీల నుంచి బతుకమ్మలతో మహిళలు బుద్ధవనానికి వచ్చారు. తెలంగాణ సాంస్కృతిక ఛైర్మన్ వెన్నెల ఆధ్వర్యంలో కళాబృందం బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. బుద్ధవనం సిబ్బంది, విజయవిహార్ , నందికొండ మున్సిపాలిటీ, సమభావన సంఘం గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను బుద్ధవనంలోని లోటస్ ప్లాంట్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్దవూర తహసీల్దార్ శాంతిలాల్, మునిసిపల్ కమిషనర్ వేణు, సాగర్ నెహ్రూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, ఎస్ఐ ముత్తయ్య, రమేష్‌జీ ఉన్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ



వేములపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన వల్లనుదాసు వెంకటయ్య గుండెపోటుతో మృతిచెందగా కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, చిరుమర్రి కృష్ణయ్య, మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కోటయ్య, నగేష్, వెంకటేశ్వర్లు, గిరి తదితరులు ఉన్నారు.

# పొమ్మన లేక పొగబెట్టారు!

(5వ పేజీ తరువాయి)

పంపారు. డీఎంహెచ్‌వోల పరిధిలో 12 ఏళ్లుగా పనిచేస్తున్న 104 ఉద్యోగులను వివిధ విభాగాల్లో సర్దుబాటు చేయడం, వేతనాలు పెంచకపోవడం, డ్రైవర్లను మెడికల్ కళాశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా నియమించడం ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నెల 24 నుంచి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే బడ్జెట్‌లేని డిపార్ట్‌మెంట్‌లో సర్దుబాటు చేయడం అక్కడ ఆందోళన చేస్తే మరో విభాగానికి పంపిస్తూ ఉన్నతాధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానం లో 12ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అదే ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్ కేటాయింపు విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా గత రిజర్వేషన్లు దాదాపు ఉండవని, ఎక్కడైనా స్వల్ప సంఖ్యలో స్థానాలకు ఆయా సామాజికవర్గాల జనాభా అత్యధికంగా ఉన్న చోట రిజర్వేషన్ సైకిల్ ప్రకారం అనివార్యమైతే తప్ప మారుతాయనే సంకేతాలతో సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నారనే సమాచారంతో పలువురు నాయకులు వారి స్థానాలు అనుకూలంగా వచ్చేందుకు అవకాశాలున్నాయోమేనని ప్రయత్నాలు చేశారు. ఆయా స్థానాలు ఏ వర్గానికి దక్కుతున్నాయనే అంశంపై ఆరా తీసేందుకు ప్రయత్నించారు.

### రంగంలోకి దిగేందుకు సిద్ధమైన నేతలు

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో పోటీచేసి గద్దె ఎక్కాలని తహతహలాడుతున్న ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులంతా రిజర్వేషన్ల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటనకు ముందే రిజర్వేషన్లు ప్రకటించనుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15, బీసీలకు 25, మహిళలకు అన్ని కేటగిరీల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఈసారి ఎస్సీ, ఎస్టీలు, మహిళా రిజర్వేషన్ల శాతా లు యథావిధిగా కొనసాగుతుండగా, బీసీలకు 25 నుంచి 42శాతానికి పెరుగుతుంది. ఇప్పటికే గ్రామాలు, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేష న్లు అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## బాల బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

హాలియా, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా బాలికల జట్లను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, జి. కర్తయ్య మంగళవారం ఎంపిక చేశారు. **బాలికల విభాగంలో...** ఎండీ. అస్మా(అలీనగర్), సాయి అభిజ్ఞ(తిరుమలగిరి), సంతోషిని(నల్లగొండ), దేవిశ్రీ(కుర్మేడు), చందన(చింతపల్లి), లక్ష్మి (పెద్దమునగల్), వైష్ణవి(నల్లగొండ), అనూత్న(హాలియా), అక్షర(దేవరకొండ), అనిత(పెదమునిగల్), మౌనిక(చెర్కుపల్లి), వసంత(యాద్గరిపల్లి), శ్రీ హని(నకిరేకల్), మహతి(హాలియా) ఎంపికయ్యారు. **బాలుర విభాగంలో...** పవన్(గువ్వలగుట్ట), నితిన్(డిండి), స్టాలిన్(దేవరకొండ), జోసఫ్(భీమపల్లి), శ్రీహరి(అడవిదేవులపల్లి), అరుణ్(చెర్కుపల్లి), భానుప్రకాష్ (హజారీగూడెం), గణేష్(పీఏపల్లి), ధనుష్ (తిరుమలగిరి), అంజనేయులు (హాలియా), శివ(తడకమళ్ల), అనిల్(కుర్మేడు), నిఖిల్ (చెర్కుపల్లి), అఖిల్ మణితేజ (చల్మారెడ్డిగూడెం) ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముక్కల్‌లో జరిగే సబ్ జూనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.

## ప్రజలకు అందుబాటులో గ్రామీణ వైద్యులు




హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు

హాలియా, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజలకు 24 గంటలు అందుబాటులో గ్రామీణ వైద్యులు అందుబాటులో ఉంటూ చికిత్స అందజేస్తున్నామని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం అనుముల మండల వైద్యులు తెలిపారు. దాడులకు నిరసనగా మంగళవారం హాలియాలో సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60వేల మంది గ్రామీణ వైద్యులు ఆందోళన చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి బ్రహ్మచారి, కృష్ణారెడ్డి, హుస్సేన్, రవికుమార్, కత్తి కోటిరెడ్డి, పాండునాయక్, సైదులు, లింగారెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, ద్రోణాచార్య, సైదులు, రవికుమార్, దశరథ పాల్గొన్నారు.

## డీఎస్పీ కార్యాలయ మీటింగ్ హాల్ ప్రారంభం



మీటింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, ఎస్పీ శరత్‌చంద్రపవార్ మంగళవారం ప్రారంభించారు. వారంతపు క్రైమ్ మీటింగ్‌లకు, ప్రెస్ మీట్‌లకు డీఎస్పీ భవనంలో చాలినంత స్థలం లేకపోవడంతో కార్యాలయానికి ఆనుకుని ఉన్న మైదానంలో రేకులపై కప్పుతో నిర్మించిన మందిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాజశేఖర్‌రాజు, సిఐలు సోమనర్సయ్య, నాగభూషణం, పీఎస్‌డీ ప్రసాద్, ఎస్ఐలు హరీశ్‌రెడ్డి, లక్ష్మయ్య, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి స్థాపనకు బ్రహ్మకుమారీల కృషి

మిర్యాలగూడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి స్థాపనలో బ్రహ్మకుమారీలు విశేషకృషి చేస్తున్నారని రాజయోగి బీకె జూరజ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన తీవ్ర పురషార్ధ యోగా సాధన, ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజయోగిని గీతా బహెన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆయనను కలిసి జ్ఞాపికను అందజేశారు. అనంతరం రాజయోగి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 140దేశాల్లో బ్రహ్మకుమారీ సంస్థలు వున్నాయన్నారు. బ్రహ్మకుమారీలు స్వచ్ఛందంగా సమాజ సేవ చేస్తున్నారని చెప్పారు. ప్రపంచ మానవాళికి ఏ విపత్తు వచ్చినా సేవలు అందించడానికి సంస్థ పనిచేస్తుందని చెప్పారు. నిత్యం యోగా ధాన్యంసాధన చేయడం వల్ల మనిషిలో ఉత్తేజం పెంపొందుతుందని, ఆరోగ్యం నిలకడగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మకుమారీల తెల్లని వస్త్రధారణలాగే వారి మనసు శాంత స్వభావాన్ని కలిగివుంటారన్నారు. తోటి మానవులు ఆపదలో వున్నప్పుడు ఆదుకు నేందుకు ముందువరసలో ఉంటారన్నారు. విశ్వశాంతి వర్థిల్లాలనేదే వారి అభిమతమన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బ్రహ్మకుమారీస్ ప్రధాన సేవా కేంద్రం ఇన్‌చార్జి రాజయోగిని, బ్రహ్మకుమారీలు శంకుతల, ధనలక్ష్మి, హేమ, రంగన్న, జేయిని ప్రకాశ్‌రావు, మురళీ, కర్నాటి రమేశ్, గుడిపాటి శ్రీనివాస్, వేణు తదితరులు ఉన్నారు.



సూరజ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : కిష్కింధపురి, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: భద్రకాళి, విట్రోస్: కిష్కింధపురి, లిటిల్ హార్ట్స్, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : లిటిల్ హార్ట్స్, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్